
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 103 వ భాగం

## భగవత్స్వరూపం

విశ్వరూప సందర్శనానికి ముందు భగవంతుడి విభూతి ఏయే రూపాలలో చూడవచ్చో, ఎలా ఉంటుందో చెప్పాక కృష్ణుడు అంటాడు అర్జునుడితో,

యద్య ద్విభూతిమత్సత్వం శ్రీమదూర్జితమేవ వా,
తత్తదే వావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవం (విభూతియోగం – 41)

దీనర్థం ఏమిటంటే, భగవంతుడైన తన విభూతి ఇదీ అదీ అని చెప్పడం ఎందుకు? ఎక్కడైతే శ్రీమంతము, శ్రేష్టమైన వస్తువులు కానీ మనుషులూ కానీ మరేదైనా కానీ ఉంటే అది భగవంతుడి శక్తి, అంశాల వల్ల పుట్టిందే సుమా అని తెలుసుకో చాలు. మనకున్న బుద్ధీ, మేధస్సూ, మనం కనుగొనే, కనుగొనబోయే ఎదైనా సరే అది వికసించాలంటే భగవంతుడి వల్ల మాత్రమే సాధ్యం అని చెప్తున్నాడు. ఎందుకయ్యా ఇంత గోల అసలు భగవంతుడనేవాడే లేడు అనుకుంటే చాలు కదా? అనుకోచచ్చు, కనీ ఆ దారిలో బతికినవాళ్ళు కూడా చెప్పేదేమిటంటే ఈ ప్రపంచం అంతా ఒకానొక శక్తి మీద ఆధారపడి నడుస్తోంది. ఎది ఎలా ఎక్కడ ఉందో తెలియదు. దాన్నే కొంతమంది భగవంతుడు అని తెలుసుకున్నాక మిగతావాళ్లకి చెప్పారు. అయితే ఆ శక్తి అందరికీ అంత సులభంగా కనిపించదు కనక ఓ రూపు ఏర్పాటు చేసుకోవడం లేదా ఒక రాముణ్ణో కృష్ణుణ్ణో – వాళ్ళు శ్రేష్టమైన పనులు చేసి చూపించారు కనక – భగవంతుడిగా చెప్తున్నాం. ఇటువంటి వారిని అవతార పురుషులు అనడంతో అసలు అవతారాలెన్ని అనే ప్రశ్న ఉదయిస్తోంది కనక ముఖ్యమైనవి పది, మిగతావి ఇన్నీ అని చెప్పడానికి లేదు. ఎందుకు చెప్పలేం అనే ప్రశ్నకి విభూతియోగంలో చెప్పిన పై శ్లోకమే సమాధానం. ఈ విషయం గురించే బ్రహ్మ మరింత వివరంగా చెప్తున్నాడు నారదుడితో ఇప్పుడు.

వ. అని మఱియుఁ బితామహుండు నారదున కిట్లనియె "మునీంద్రా! పుండరీకాక్షుం డంగీకరించిన లీలావతార కథావృత్తాంతంబు నేను నీకు నెఱింగించు నింతకు మున్న హరి వరాహాద్యవతారంబు లంగీకరించి తత్ప్రయోజనంబులఁ దీర్చె; మన్వంతరావతారంబు లంగీకరించినవియు నంగీపరింపఁగలవియునై యున్నయవి; వర్తమానంబున ధన్వంతరి పరశురామావతారంబులు దాల్చి యున్నవాడు; భావికాలంబున శ్రీరామాద్యవతారంబుల నంగీకరింపం గలవాఁ; డమ్మహాత్ముండు సృష్ట్యాది కార్యభేదంబులకొఱకు మాయా గుణావతారంబు లందు బహుశక్తి ధారణుండైన భగవంతుఁడు సర్గాదినిఁ దపస్సులును, నేనును, ఋషిగణంబులును, నవప్రజాపతులునునై యవతరించి విశ్వోత్పాదనంబు గావించుచుండు; ధర్మంబును విష్ణుండును యజ్ఞంబులును మనువులును నింద్రాది దేవగణంబులును ధాత్రీపతులును నయి యవతరించి జగంబుల రక్షించుచుండు; నధర్మంబును రుద్రుండును మహోరగంబులును రాక్షసానీకంబులునునై యవతరించి విలయంబు నొందించుచుండు; ని త్తెఱంగునం బరమేశ్వరుండును సర్వాత్మకుండును నైన హరి విశ్వోత్పత్తి స్థితి లయ హేతుభూతుండై విలసిల్లు; ధరణీరేణువుల నయిన గణుతింప నలవి యగుంగాని యమ్మహాత్ముని లీలావతారాద్భుతకర్మంబులు లెక్కవెట్ట నెవ్వరికి నశక్యంబై యుండు; నీకు సంక్షేపరూపంబున నుపన్యసించితి సవిస్తారంబుగా నెఱింగింప నాకుం దరంబు గాదనిన నన్యులం జెప్పనేల? వినుము. [2-199]

ఒకప్పుడు ధన్వంతరి, రామ, పరశురామ అవతారాలు ధరించిన భగవంతుడు బహుశక్తి సంపన్నుడు. నాతోపాటు సప్త ఋషులని, తొమ్మిది మంది ప్రజాపతులుగా అవతరించి విశ్వాన్ని ప్రభవిస్తాడు. అలా పుట్టించిన జగాన్ని కాపాడడానికి కూడా ఆయనదే అవతారం. లీనమైనపుడు మరోసారి రుద్రుడిగా అవతరించి విలయం సృష్టించేదీ ఆయనే. ఇన్ని పనులు చేస్తున్నాడు కనక ఆయనొక్కడే సత్యం. ఈ భూమిమీద ఉండే ధూళి రేణువులని లెక్కపెట్టొచ్చు కానీ భగవంతుడి లీలావతారం, ఆ అవతారాలు చేసే అద్భుతమైన కార్యాలూ లెక్కపెట్టడం ఎవరి తరమూ కాదు. ఆయన నాభిలోంచి పుట్టిన బ్రహ్మనైన నాకే చేతకాదు అటువంటప్పుడు మిగతా వారి సంగతి చెప్పడం అనవసరం. ఈ విషయాలనే శుకమహర్షి పరీక్షిత్తుతో చెప్తూ "విష్ణుదవ్యయుండు విమల చరిత" అనడం ముందు వ్యాసాల్లో చూసాం.

చ. అమరఁ ద్రివిక్రమస్ఫురణ నందిన యమ్మహితాత్మపాద వే
గమున హతంబులైన త్రిజగంబుల కావల వెల్గు సత్యలో
కము చలియించినం గరుణఁ గైకొని కాచి ధరించు పాదప
ద్మము తుది నున్న యప్రతిహతం బగు శక్తి గణింప శక్యమే? [2-200]

వామనుడు త్రివిక్రముడిగా విజృంభించాడు కదా అప్పుడు మూడు జగాలనీ కేవలం రెండు అడుగులతోనే ఆక్రమించాడు. ఆ విజృంభణకి వీటికి ఆవల ఉన్న సత్యలోకం కూడా వణికిపోయింది. అప్పుడు వాటికి ఏ ఆపదా రాకుండా కాపాడినటువంటి ఆ పాదాలకి ఉన్న శక్తి గణింపగలమా?

మ. హరి మాయా బల మే నెఱుంగ నఁట శక్యంబే సనందాది స
త్పురుషవ్రాతము కైన, బుద్ధి నితరంబున్ మాని సేవాధిక
స్ఫురణం దచ్చరితానురాగగుణవిస్ఫూర్తిన్ సహస్రాస్య సుం
దరతం బొల్పగు శేషుఁడుం దెలియఁ డన్నం జెప్ప నే లొండొరున్. [2-201]

ఇటువంటి భవంతుడి శక్తి, మాయ అనేవి ఆయన నాభిలో పుట్టిన నేనే తెలుసుకోలేకపోతున్నాను. సనక సనందనాదులకైనా కుదరదు. ఆయనకి శేషతల్పంగా వ్యవహరించే ఆదిశేషుడు కూడా ఆలోచనలన్నీ వదిలిపెట్టి (బుద్ధి నితరంబున్ మాని) వేయితలల్తో కీర్తిస్తూ ఉంటాడు. ఈ పద్యంలో నిఘూఢంగా బ్రహ్మ చెప్పేది ఏమిటంటే భగవంతుడు ఇదీ, ఇలా ఉంటాడు, అలా ఉంటాడు అనే ఆలోచనల్తో ఎప్పటికీ ఎవరూ ఆయనని తెలుసుకోలేరు. బుద్ధి, ఇంద్రియాలనీ, మనస్సునీ వాడి ఆయన్ని తెలుసుకోవడం వ్యర్థం. చేయాల్సిన పని ఒకటే – శరణాగతి. దానితో సులభంగా ఆయన్ని తెలుసుకోవచ్చు. ఏ మతం కానీయండి ఏ ముని కానీయండి వాళ్ళు చెప్పేది ఇదే.

చ. ఇతరముమాని తన్ను మది నెంతయు నమ్మి భజించువారి నా
శ్రితజన సేవితాంఘ్రి సరసీరుహుఁడైన సరోజనాభుఁ డం
చితదయతోడ నిష్కపటచిత్తమునం గరుణించు; నట్టివా
రతుల దురంతమై తనరు నవ్విభు మాయఁ దరింతు రెప్పుడున్. [2-202]

అన్ని విషయాలనీ కట్టిపెట్టి మనసులో తనని నమ్మేవారిని అత్యంత సులభంగా అనుగ్రహిస్తాడు. ఎలా అంటే నిష్కపట చిత్తమున, అంచిత దయతోడ. అటువంటి వారు మాత్రమే ఆయన మాయ ని దాటగలుగుతారు. ఇదే విషయం మనం ముందొకసారి అంబరీషోపాఖ్యానంలో చూసాం. సుదర్శన చక్రం తరుముతూంటే దుర్వాసుడు బ్రహ్మ దగ్గిరకీ, శివుడి దగ్గిరకీ వెళ్ళాక విష్ణువు దగ్గిరకి వస్తే ఆయనే చెప్తాడు ఈ విషయం.

చ. చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలి కొనిపోవుచుందురు రకిల్బిషభక్తిలతాచయంబులన్
నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్;
వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతం జనకుందుఁ దాపసా! [9-118]

ఎందుకలా దయ ఆయనకి? సాధు సత్పురుషులు భగవంతుణ్ణి తప్ప మరేమీ కోరుకోక, ఆయనన్ని తీసుకెళ్ళి తమ తమ మనసులలో మదించిన ఏనుగును ఎక్కడకీ కదలకుండా కట్టేసినట్టూ కట్టేస్తారు. అందువల్ల ఆ వలలకి చిక్కి తప్పించుకోలేక భగవంతుడు భక్త జన వత్సలుడు కనక వాళ్ల మనసులలోనే ఉంటాడు.

వ. మఱియును సంసారమగ్నులయి దివసంబులు ద్రోఁచియు నంతంబున శునక సృగాల భక్షణంబులైన కాయంబులందు మమత్వంబు సేయక భగవదర్పణంబు సేసిన పుణ్యాత్ములుం గొందఱు గల రెఱింగింతు; వినుము; నేను నీ బ్రహ్మత్వంబునం జెందు రాజసంబు విడిచి యమ్మహాత్ముని పాదారవిందంబుల భక్తినిష్ఠుండ నయి శరణాగతత్వంబున భజియించు నప్పుడు దెలియుదు రాజసగుణుండనై యున్న వేళం దెలియంజాలఁ; గావున శాస్త్రంబులు ప్రపంచింపక కేవల భక్తిజ్ఞానయోగంబున సేవింతు; మఱియు సనకాదులగు మీరును, భగవంతుండైన రుద్రుండును, దైత్యపతియైన ప్రహ్లాదుండును, స్వాయంభువమనువును, నతని పత్ని యగు శతరూపయుఁ, దత్పుత్రులగు ప్రియవ్రతోత్తానపాదులునుం, దత్పుత్రికలగు దేవహూత్యాదులునుం, బ్రాచీనబర్హియు, ఋభువును, వేనజనకుం డగు నంగుండును, ధ్రువుండును గడవంజాలుదురు వెండియు. [2-203]

ఇంత చెప్పాక మనకో సందేహం వస్తుంది కదా, అసలు భగవంతుడు నిజంగా కనిపిండానికి అటువంటి శరణాగతి చేసిన వాళ్ళెవరైనా ఉన్నారా? వాళ్ల గురించే పై వచనం చెప్పేది. బతికి ఉన్నంతకాలం దినాలన్నీ గడిపాక, కుక్కలకీ నక్కలకీ ఆహారమయ్యే ఈ శరీరం మీద మమకారం పెంచుకోకుండా భగవంతుడి సేవకే వినియోగించినవారు కొంతమంది ఉన్నారు. నేను బ్రహ్మని కదా అని ఒక్కొక్కప్పుడు నాకు రాజసంతో కూడిన అహంకారం కలిగినప్పుడు భగవంతుడి ఉనికి తెలియదు. దాన్ని అతిక్రమించి భక్తితో మాత్రమే భజించేటపుడు మాత్రమే ఆయన గురించి తెలుస్తుంది. సనక సనందాదులు, నారదుడు, రుద్రుడు, రాక్షసుల రాజైన ప్రహ్లాదుడు, స్వాయంభువమనువు, ఆయన భార్యలు, ధ్రువుడు, ఇటువంటివారు మాత్రమే మాయని గెల్చారు. ఏ విధంగా గెల్చారు అనేది చూస్తే భక్తి వల్ల మాత్రమే అని అర్థమౌతుంది.

సీ. గాధి, గయాదు; లిక్ష్వాకు, దిలీప, మాం–
ధాతలు; భీష్మ, యయాతి, సగర,
రఘు, ముచుకుందైళ, రంతిదేవోద్ధవ,–
సారస్వతోదంక, భూరిషేణ,
శ్రుతదేవ, మారుతి, శతధన్వ, పిప్పల,–
బలి, విభీషణ, శిబి, పార్థ, విదురు;
లంబరీష, పరాశరాలర్క, దేవల,–
సౌభరి, మిథిలేశ్వరాభిమన్యు [2-204]

తే. లార్ష్టిషేణాదులైన మహాత్ము లెలమిఁ
దవిలి యద్దేవు భక్తిఁ జిత్తముల నిల్పి
తత్పరాయణు లౌట దుర్దాంతమైన
విష్ణుమాయఁ దరింతురు విమలమతులు. [2-204.1]

ఈ సీసంలో భగవంతుడి మాయ అతిక్రమించిన వారి పేర్లు చెప్తున్నాడు. వీళ్ళందరూ కూడా దుర్దాంతమైన (దాటలేనిది) విష్ణుమాయని అతిక్రమించిన వారు. ఈ పద్యంలో హనుమంతుడు, సిబి, అర్జునుడు, బలి, విభీషణుల తో పాటు మీ తండ్రి అభిమన్యుడు ఉన్నాడు; అందువల్ల నీకు కూడా ఏమీ హని జరగదు (శాపం వల్ల చనిపోయినా సరే) అని చెప్తున్నాడన్నమాట శుకమహర్షి పరీక్షిత్తుతో.

అయితే ఇవన్నీ అందరికీ తెల్సినవే. అటువంటివారికేనా భగవంతుడు కనిపించేది? మిగతావారికెలా? దానికి సమాధానం కింద పద్యంలో చెప్తున్నాడు.

మ. అనఘా! వీరల నెన్ననేమిటికిఁ; దిర్యగ్జంతుసంతాన ప
క్షి నిశాటాటవికాఘ జీవనివహస్త్రీ శూద్ర హూణాదులై
నను నారాయణభక్తి యోగమహితానందాత్ములై రేని వా

రసయంబుం దరియింతు రవ్విభుని మాయావైభవాంభోనిధిన్. [2-205]

ఈ వీరుల సంగతి దేనికి? పశువులు (తిర్యక్), పక్షులు, రాక్షసులు (నిశాట), అటవికులు, స్త్రీలు, పురుషులు, ఎవరికైనాసరే నారాయణ భక్తి ఉంటే చాలు ఆయన మాయ అనే సముద్రాన్ని దాటగలరు.

క. శశ్వత్ప్రశాంతు నభయుని
విశ్వాత్ముఁ బ్రబోధమాత్రు విభు సంశుద్ధున్
శాశ్వతు సము సదసత్పరు
నీశ్వరుఁ జిత్తమున నిలుపు మెపుడు మునీంద్రా! [2-207]

వ. అట్లయిన నప్పుణ్యాత్ముల ననవద్యశీలుర నవిద్య లజ్జావనత వదనయై పొందంజాలక వైముఖ్యంబున దవ్వుదవ్వులం దలంగిపోవు మఱియును. [2-208]

అందువల్ల నారదా నువ్వు శశ్వత్ప్రశాంతు (నిరంతరం ప్రశాంతంగా ఉండేవాడు), అభయుడు (భయం అనేది లేనివాడు), విశ్వాత్ముడి (విశ్వమే శరీరంగా కలవాడు, హరి మయము విశ్వమంతయు అని కదా చెప్పినది), ప్రభోధమాత్రుడు (జ్ఞానంతో మాత్రమే తెలుకోగలిగేవాడు), సంశుద్ధిన్ (పరిశుద్ధుడైనవాడు) అయిన భగవంతుణ్ణి నీ హృదయంలో నిలుపుకో. అలాచేస్తే అవిద్య అనేది సిగ్గుతో తలవంచుకుని దూరంగా తొలగిపోతుంది. అవిద్య అంటే తెలినదే కదా, ఈ శరీరమే నిజం అనుకునే విషయం. విషయవాసనలే తప్ప మరేమీ లేదనుకోవడం వగైరా.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS